# పెళ్ళెందుకు?

"మాధవీ, మోహన్‌లు పెళ్ళి చేసుకుంటున్నారు!"

ఒకరికొకరు అత్యంతాశ్చర్యంగా వింతగా చెప్పుకుంటున్నారు ఈ వార్త అదేపనిగా!

అందరిలోనూ ఈ వార్త ఇంత సంచలనం కలగ జేయడానికి కారణం అది పునర్వివాహమూ కాదు, వితంతు వివాహమూ కాదు, వర్ణాంతర వివాహమూ కాదు— ఇవన్నీ కూడా పాతబడిపోయాయి. వీటన్నిటినీ మించి మరో కొత్త ప్రశ్న లేవదీసింది మాధవి, "అసలు పెళ్ళెందుకు?" అని......

మాధవి తనను ప్రేమిస్తోందని నిశ్చయించుకున్నాక మామూలు ధోరణిలో అడిగాడు మోహన్ "మనం ఎప్పుడు పెళ్ళి చేసుకుందాం?" అని......

అప్పుడే అడిగింది మాధవి "అసలు పెళ్ళెందుకు?" అని.

బిత్తర పోయాడు మోహన్. "అదేమిటి? పెళ్ళి చేసుకోకుండా ఎలా?" అన్నాడు. అంతకంటె ఏం సమాధానం చెప్పాలో తెలియక......

"ఎలా ఏముందీ? నాకు నువ్వు నచ్చావు. నీతో జీవితం బాగానే గడుస్తుం దనిపించింది. నా సంతానానికి నువ్వు తండ్రివి కావటం ఇష్టమే...... ఇంతకంటె ఏముంది?"

"అంటే? పిల్లలు పుట్టినా నన్ను పెళ్ళిచేసుకోనంటావా? ఏమిటి?" మతిపోయినట్లే అడిగాడు మోహన్.

"పిల్లలకు, పెళ్ళికీ సంబంధ మేమిటి? ఆ మధ్య పేపర్లో చదవలేదూ? ఆదిమవాసులలో అనేక మంది పెళ్ళిళ్ళు చేసుకోకుండానే– పిల్లలతో సుఖంగా కాపురాలు చేస్తున్నారని......"

"ఛ! మనం కూడా ఆ ఆదిమవాసుల్లా అనాగరికంగా ఉండాలనా, నువ్వనేది?" అన్నాడు మోహన్ మాధవి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

"అబ్బ! ఏమిటో ఈ ఆధునికుల నాగరికత? పెళ్ళాం అంటే బాడేర్ లేబరర్ కంటె అధ్వాన్నం అనుకోవటమేనా?"

"ఎక్కడో ఏ ఒక రిద్దరో అలా ఉన్నారని అందరినీ అంటావేమిటీ! అసలు పెళ్ళే వద్దంటావా?"

"పెళ్ళి ఎందుకో చెప్పమంటున్నాగా?......" ప్రశ్నించింది మాధవి అనునయంగా.

"ఎందుకంటే...... ఎందుకంటే......" చటుక్కున ఏ సమాధానమూ స్ఫురించలేదు మోహన్‌కి.

మోహన్ సమాధానం కోసం తడుముకుంటున్నట్టు గమనించింది మాధవి. తనే అంది—

"అవును. ఎందుకు? పెళ్ళనేది చాలా పవిత్రమైనదని నమ్ముతున్నామా మనం? పురోహితుడు చదివే మంత్రాల్లో ఏ ఒక్కరికైనా నమ్మకముందా? అసలా మంత్రాలు ఎవరైనా వింటారా? చదివే పురోహితుడైనా సమంగా చదువుతాడా? 'కానియ్యండి! కానియ్యండి!' అనటం ఒకటే వినిపిస్తుంది నాకు, ఆ పెళ్ళిళ్ళలో. అంత అర్థం పర్థం లేకుండా ఒక తంతులాగ ఆ పెళ్ళి చేసుకోక పోతేనేం?"

"పోనీ, రిజిస్టర్ మారేజి చేసుకుందాం!"

"ఎందుకు? హక్కుల కోసమా? నీ ఆస్తిపాస్తుల్లో నాకేమీ వాటా అక్కర్లేదు. పెళ్ళి వంకతో నా సంపాదన మీద కూడా నువ్వే అధికారం చెలాయించాలని చూసినా ఒప్పుకోను......"

"ఛ! డబ్బుకోసమా?"

"మరి దేనికి?"

"మనం ఎప్పుడూ ఇలా ఉంటామని నమ్మకమేమిటి?- ఒకవేళ మనసు మారితే......"

"ఓహ్! మనసులు మారితే పెళ్ళి మనని చచ్చినట్టు కట్టిపడేసి ఉంచుతుందా? అందుకే పెళ్ళా? ఎవడికి కావాలి అలాంటి పెళ్ళి? నా మనసు నీ మీద కాదు- మరోదాని మీదకు పోయింది- దానితో ఉంటాను అని నువ్వంటే,

వీల్లేదు- నా ప్రాణనాథా! నీ పాదాలు వదలను- అని కాళ్ళు పట్టుకు వేళ్ళాడటానికా పెళ్ళి? ఛా! ఛా! నీ మనసు మారితే నిరభ్యంతరంగా ఆ వలచిన చిన్నదానితో పో! నేను నిన్నేమీ నిర్బంధించను."

మాధవి ముఖంలో రోషమూ, ఆవేశమూ చూసి హడలిపోయాడు మోహన్. మాట మారుస్తూ "మారేది నా మనసేనా? నీ మనసు మాత్రం మారదని నమ్మకమేమిటి?" అన్నాడు. "నా మనసు జన్మ జన్మలకీ మారదు" అంటుందనే ఆశతో......

కాని మాధవి అల్లరిగా నవ్వి. "అవును-అదీ నిజమే! నా మనసు మారిపోవచ్చు. అంచేత నీ ప్రేమతో, అనురాగంతో, లాలనతో, నా మనసు మారిపోకుండా జాగ్రత్త పడు" అంది.

"హతోస్మి!" అన్నాడు మోహన్ తల రెండు చేతులతో పట్టుకుని.

"మరో విషయం మరచిపోయావు. సమాజంలో చిన్న చూపు చూస్తారు" అన్నాడు చటుక్కున స్ఫురించి. బహుషారుగా ఇక ఈ దెబ్బకు మాధవి లొంగిపోవలసిందే ననుకున్నాడు ఖచ్చితంగా.

"సమాజం......చిన్నచూపు......" నిరసనగా నవ్వింది మాధవి.

"ఈ సమాజం నిజంగా మంచి వాళ్ళని ఎలా చిన్న చూపు చూడగలదో తెలుసా? నాకు తెలిసిన ఒకావిడ ఖర్మకాలి వెర్రిబాగుల మనిషికి భార్య అయింది. రూపములో తెలివిలో, అంతస్థులో, అన్నిటా ఆవిడ అతనికంటె ఒక మెట్టు పైనే ఉంది. పాపం. పెళ్ళయ్యాక కాని తన దుర దృష్టం ఏపాటిదో ఆవిడకు తెలిసిరాలేదు. నిబ్బరంతో, సహనంతో ఆ వెర్రి బాగుల మనిషినే సాధ్యమయినంత వరకు బొమ్మ మనిషిగా తయారు చేసింది. అర్ధాంగి సిని మాలో లాగ గభాలున పూర్తిగా మారిపోక పోయినా, అతడికొక ఉద్యోగమూ, ఒక హోదా వచ్చేలా చేసింది. అయితేనేం! ఈవిడకీ యిస్తేకాని ఆ బొమ్మ మనిషి కదలడు. అందరూ ఫలానా ఆవిడ మొగుణ్ణి డామినేట్ చేస్తుందని చిన్నచూపు చూస్తారు. ఆవిడ పరిస్థితి ఏమిటి? ఒక్కరూ అర్ధంచేసుకోరు తెలిసినా. అదీ ఆవిడని చిన్నచూపు చూడ టానికే "వెర్రాడి పెళ్ళాం!" అని ఒక ఆయుధంగా ఉపయో గించుకుంటారు. ఇలాటి సమాజం చిన్నచూపుకా నేను భయపడవలసింది? అయినా నాకా భయం లేదు. నేను ఉద్యోగస్థురాలిని. సమాజానికి నన్ను చిన్నచూపు చూసే సాహసం లేదు. రేపు మహిళా మండలిలో ఏదో ఫంక్షన్ ఉందని, బహుమతి ప్రదానానికి నన్ను ఆహ్వానించింది ప్రెసిడెంట్."

"అయితే, ఇంతకూ పెళ్ళి చేసుకోనంటావా?" దిగు లుగా అడిగాడు మోహన్.

"ఎందుకు చేసుకోవాలో చెప్తే కాని చేసుకోను. గుడ్డిగా నేనే పనీ చెయ్యను."

"మాధవితో వాదించ గలిగే శక్తి మోహన్‌కి లేక పోయింది. ఆ రోజు మాధవి తలంటి పోసుకొని, కొత్త చీర కట్టుకుని "నీ గుర్తు కేదైనా బహుమతి ఇవ్వు" అంది.

అలా ఎప్పుడూ మాధవి అడగదు. "ఏం కావాలి? ఉంగరమా? గొలుసా? చీరా?" అని అడిగాడు ఉత్సాహంగా.

"చీర వద్దు. ఏదైనా ఎప్పటికీ ఉండేది ఇవ్వు."

"ఏ ముంది? నా మనసే!" అన్నాడు నవ్వుతూ.

మాధవి కూడా నవ్వి "ఆ మనసు కనపడదుగా! కన పడని ఆ మనసులో అనురాగం కనిపించేలాగ" అంది.

తన వేలికున్న ఉంగరం తీసి మాధవి వేలికి తొడి గాడు మోహన్, అది కొంచెం వదులయినా, మధ్య వేలికి మాత్రమే పట్టినా, మొగ ఉంగరమని తెలిసిపోతున్నా దానిని తీయకుండా అలాగే వేలికి ఉంచుకుంది మాధవి.

మాధవీ మోహన్‌లు కలిసి కాపురం చేస్తున్నారు. పెళ్ళిమాత్రం చేసుకోలేదు. ఇది అందరికీ విడ్డూరంగా ఉంది. మోహన్‌కి కష్టంగానే ఉంది. కానీ, మాధవి పట్టించుకోవ టంలేదు. మాధవి కూడా కొన్ని చిన్న చికాకులను ఎదు ర్కోవలసి రాకపోలేదు.

ఎంత చదువుకున్నా, ఉద్యోగస్థులయినా ఆడవాళ్ళు అమ్మలక్కల ధోరణి ప్రదర్శించకుండా ఉండలేరు. రకరకాల ప్రశ్నలు అడగకుండా ఉండలేరు.

"మోహన్‌గారూ మీరూ ఒక ఇంట్లో ఉంటున్నారా?"

"అవును!"

"పెళ్ళి చేసుకోలేదా?"

"లేదు!"

"ఎందుకు?"

"చేసుకోవాలనిపించలేదు."

ఇలాంటి సమాధానాలు ఇంత నిర్భయంగా చెప్పే ఆ వ్యక్తిని ఏం చెయ్యాలో అర్థం కాలేదు వాళ్ళకి. అదీగాక మాధవి మంచి హోదాలో ఉన్న ఉద్యోగంలో ఉంది తెల్లారి లేస్తే అవిడతో ఎన్నో అవసరాలు! ఇంతకంటే ఆవిడను కష్టపెట్టగలగటం సాహసమే!

ఓరోజు మోహన్ దిగాలుగా "నువ్వునిజంగానే పెళ్ళి చేసుకోవా!" అన్నాడు ఎప్పటిలాగే. "ఎందుకు పెళ్ళిచేసుకోవాలి చెప్పు!" అంది. మోహన్‌కి మండి "ఎందుకు చేసుకోవో చెప్పు?" అన్నాడు.

"మన దేశంలో ఆడదానికి మొగవాడి భార్య కావటం కంటే ప్రేయసిగా ఉండడమే ఎక్కువ అదృష్టం కనుక.

అలా అయితేనే ప్రేమించినవాడి ప్రేమానురాగాలు పొందగలరు గనుక......"

చిరునవ్వుతో సమాధానం చెప్పింది మాధవి.

"నిన్ను చంపినా పాపంలేదు" కోపంగా అన్నాడు మోహన్.

"అలాటి మాటలనకు. నేను నీ భార్యను కాను." కవ్విస్తున్నట్లుగా అంది.

"పోనీ, సంఘంలో ఒక ప్రతిపత్తి అక్కర్లేదు నీకు?"

నాకొక వ్యక్తిత్వమే లేకుండా మిసెస్ మోహన్‌గా సంఘంలో లంభించే గౌరవం గొప్పదా? మాధవిగా నా ఉద్యోగమూ, నా విలువ నాకుంది. మిస్టర్ మోహన్ ఫ్రెండ్‌గా గౌరవింప బడటం గొప్పదా? నువ్వేచెప్పు, రెండోదే నయంకాదూ?"

మాధవి ఈ ధోరణిని ఎదుర్కో లేకపోతున్నాడు మోహన్.

మాధవి ఉద్యోగరీత్యా అప్పుడప్పుడు కేంప్‌నకి వెళ్తుంది. అలాంటప్పుడు మోహన్ తన ఆఫీస్‌కి దగ్గరగావున్న తన ఫ్రెండ్ పోర్షన్‌లో ఉంటాడు. సాధారణంగా మాధవి వచ్చే రోజున వచ్చేసేవాడు, ఆ రోజు మాధవి వచ్చినా మోహన్ రాలేదు. ఆ సాయంత్రమూ రాలేదు, ఆ మరు

నాడూ రాలేదు. ఏం జరిగిందోనని ఆందోళనపడుతూ మాధవి తనే బయలుదేరి వెళ్ళింది. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి స్తంభించి పోయింది. మోహన్ పడుకుని ఉన్నాడు. అతని మంచం దగ్గరగా స్టూల్ వేసుకుని ఒక అందమయిన అమ్మాయి అతని తల పడుతోంది. మాధవిని చూసి చిరాకుగా లేచివచ్చి "ఎవరు మీరు?" అంది.

"నేను...... నేను" తను ఎవరినని చెప్పుకోవాలో చటుక్కున స్ఫురించలేదు మాధవికి. ఆ అమ్మాయి సరిగ్గా "ఎవరైనా సరే! ఇప్పుడు మాట్లాడటానికి వీల్లేదు. తరువాత రండి!" అని మాధవి ముఖం మీదే తలుపులు దభాలున మూసేసింది. దిమ్మెరపోయిన మాధవి ఈడ్చుకుంటూ వచ్చి ఆటోలో కూచుని ఇంటి కొచ్చేసింది. ఆ తరువాత మూడు రోజులకి ఇంటికొచ్చిన మోహన్ మాధవిని చూసి "అదేమిటి? అలా ఉన్నావేం? వంట్లో బాగాలేదా?" అన్నాడు.

నిజంగానే మూడు రోజులకే మాధవి ముప్పై లంఖణాలు చేసిన మనిషిలా తయారయింది. ముఖం కళతగ్గి, ఏదో దైన్యం ఆవరించుకుంది.

మోహన్ మాటలు వినిపించుకోకుండా, "ఆ అమ్మాయెవరు?" అంది.

"అదా! నాకు జ్వరంవస్తే......"

మోహన్ మాటలు పూర్తికాకుండానే అందుకుంది మాధవి.

"నీకు జ్వరం వస్తే నేను దగ్గరకు రావడానికి లేదా? అదెవర్తో వన్నెలాడి దగ్గర కూచుని నా ముఖంమీాదే తలుపులు వేసేస్తుందా?"

"ఛ! ఛ! వన్నెలాడి అనకు......"

"అబ్బో! అప్పుడే అంత సన్నిహితురాలయి పోయిందా ఆవిడ నీకు."

"చాలా సన్నిహితురాలు!"

"తిన్నగా వెళ్ళి గూటిలో పడుకున్నావ్! నేను ప్రేమించినట్లుగా నిన్నెవరు ప్రేమించారు?"

"అదేం! నీలాంటి పనికిమాలిన వాళ్ళు తప్ప నన్నెవరూ ప్రేమించరా?"

"ఏయ్! నేను పనికిమాలినదాన్నా?"

"కాదులే! చాలా గొప్పదానివి. నీలాంటి గొప్ప వ్యక్తి నన్ను ప్రేమించినప్పుడు మిగిలిన వాళ్ళెందుకు నన్ను ప్రేమించరు?"

మోహన్ నవ్వుతున్నాడు. అతడు తనని ఆటలు పట్టిస్తున్నాడని అర్థమయినా ఉక్రోషం అణుచుకోలేక—

"ఆవిణ్ణి పెళ్ళి చేసుకుంటావా?" అంది.

"ఎవరినో ఒకరిని పెళ్ళిచేసుకోవాలిగా!" అన్నాడు. మాధవి మాట్లాడలేదు. మోహన్ ఆగకుండా "నేను నిన్నే

ప్రేమిస్తున్నాను ఇంకా! కానీ, నేను పెళ్ళిచేసుకోవాలి! నువ్వు పెళ్ళిచేసుకోవుగా! నేను పెళ్ళిచేసుకోబోయే ఆ భార్యకి నా మీద సర్వాధికారాలూ వస్తాయి. నిన్ను చూడాలని వున్నా నీ దగ్గరకి రాలేను. మా ఆవిడ రానియ్యదు. అలాగే, నిజంగా నీకేదయినా జబ్బుచేసినా దెయ్యంలా తను నాదగ్గర కూచుంటుందే కాని, నిన్ను రానియ్యదు. ఇలాంటివన్నీ నీకు పట్టవనుకో? మాధవీ! ఎప్పుడైనా నాకు నిన్ను ఒక్కసారి చూడాలనిపిస్తే దూరం నుంచయినా ఒక్కసారి చూడనిస్తావు కదూ!"

"షటప్!" తన కన్నీళ్ళను కోపంలో దాచుకుంటూ అరిచింది మాధవి......

ఆ ముఖం పరీక్షగా చూస్తున్న మోహన్ నవ్వు అణచుకుంటూ "అయితే ఇంకమీదట మనం ఒకరి నొకరు కళ్ళతో చూసుకోవటానికైనా నోచుకోలేదా?" అన్నాడు.

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను-" కన్నీళ్ళు కనపడకుండా ముఖం తిప్పుకుంటూ అంది......

"నాకోసం యింత కష్టపడుతూ ఇంత త్యాగం చెయ్యకు. అర్థం పర్థం లేకుండా యాంత్రికంగా ఏ పనీ చెయ్యకూడదు- నువ్వు......"

మాధవి కోపంగా మోహన్‌వైపు తిరిగి "అసలు సంగతి చెప్పు. నీ మనసు విరిగిపోయిందా?" అంది.

"ఛ! ఛ! అదేంకాదు. నేనెప్పుడూ నిన్ను పెళ్ళి చేసుకోవటానికి రెడీగానే ఉన్నాను. నువ్వే......"

"రేపే రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసుకుందాం!"

మాధవీ, మోహన్‌లు పెళ్ళిచేసుకుని ఘనమైన పార్టీ ఇచ్చారు. అందరూ పార్టీకి వచ్చి "చివరకు మాధవి కూడా పెళ్ళిచేసుకుంద" అన్నారు నవ్వుతూ.

పార్టీకి ఆనాడు మోహన్ దగ్గర కూచున్న అమ్మాయి కూడా వచ్చింది. మాధవి ముఖం ఎర్రగా చేసుకుంది. "పార్టీకి ఈపిణ్ని కూడా పిలిచారా?" అంది మోహన్‌తో.

ఆ అమ్మాయి నవ్వుతూ "అదేమిటి? మా అన్నయ్య పెళ్ళికి నేను రాకుండా ఎలా ఉంటాను?" అంది.

"అన్నయ్యా......!"

"అవును. మా చిన్నాన్న కొడుకు! సెలవులకు వీడిని చూద్దామని వస్తే వీడు మంచమెక్కాడు. మంచంలో ఉన్నా ఒకటే ఫ్రెండ్స్! వాళ్ళని పొమ్మనలేక చచ్చాను. మీరయినా మా అన్నయ్యకి కాబోయే భార్యనని నాకు చెప్పలేదుగా! నాకేం తెలుస్తుంది చెప్పండి."

మోహన్ కల్పించుకుని "అప్పటికి ఈవిడకి కూడా తెలియదులే!" అన్నాడు నవ్వుతూ.

"అదేమిటి? నాలుగు రోజుల్లో నిశ్చయమయిపోయిందా పెళ్ళి?"

"ఆఁ! అంతా నీ చలవే!"

అప్పటికి మాధవికి అంతా అర్థమయింది. ఒక్కసారి గుర్రుగా చూసి మోహన్ నవ్వటంతో తనూ నవ్వేసింది. పార్టీ ముగిసాక "నన్ను మోసం చేస్తావా?" అని పోట్లాటకు దిగింది.

"మోసం చేశానా? సరిగా గుర్తుచేసుకో! నేను జరిగింది చెప్పాలనే ప్రారంభించాను, అప్పటికే నువ్వు ఏదేదో ఊహించేసుకుని, నన్ను నువ్వు క్షోభపెట్టుకుని, ఏదేదో మాట్లాడెయ్యటం మొదలు పెట్టావు. ఇదీ బాగానే ఉందనుకుని నేను అలాగే సాగదీశాను. అమ్మమ్మా! ఏ దేవుడు ఆడవాళ్ళకి ఈ అసూయ పెట్టాడో కాని, ఆ దేవుడు చాలా మంచివాడు."

లెంపలేసుకుని బుద్ధిగా దణ్ణం పెట్టాడు మోహన్. "ఇంతకూ నాకు జబ్బుచేస్తే సేవచెయ్యటం కోసం నన్ను పెళ్ళి చేసుకున్నావు కదూ!" అన్నాడు మురిపెంగా......

"ఛత్! అదేంకాదు! నీకు జబ్బుచేస్తే నేను తప్ప ఎవరూ సేవచెయ్యటానికి వీల్లేదు కనుక, చచ్చినట్లు నిన్నే ఇచ్చకాలకు కావాలని పెళ్ళి చేసుకున్నాను."

నవ్వుకుంటూ పడుకుంది మాధవి.